రోడ్ టెర్రర్



తడకలపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న కారు (ఫైల్)

- 544ఈ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- ఇప్పటికే 12 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు

మడకశిర నియోజకవర్గ పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు నుంచి శిర వరకు వెళ్లే 544ఈ జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ పరిధిలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఇప్పటికే 12 మంది చనిపోయారు. ఎంతో మంది తీవ్రంగా గాయపడ్డారు.

మడకశిరరూరల్: కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న బాగేపల్లి, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా హిందూపురం, పరిగి, మడకశిర, రొళ్ల, అగళి మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని శిర వరకూ 544ఈ జాతీయ రహదారి ఉంది. అయితే ఆయా ప్రాంతాల్లోని గ్రామాలకు అనుకునే జాతీయ రహదారి ఉంది. డ్రైవర్లు వాహనాలను అతివేగంగా నడపడం, నిర్లక్ష్యంగా నడపడంతో ఈ హైవేపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా మలుపులు, క్రాస్‌ల వద్దనే ప్రమాదాలు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి. మడకశిర, అగళి మండలాల్లోని జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా హైవే అధికారులు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రమాదాల నివారణను చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలు ఇలా..

- గత ఏడాది జూన్ 28న బుళ్లసముద్రం వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి వచ్చిన మరో బైక్ ఢీ కొనడంతో బీ రాయాపురం గ్రామానికి చెందిన లక్ష్మీకాంతప్ప మృతి చెందాడు.
- గత ఏడాది జూలై 5న యూ రంగాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో నంద్యాలకు చెందిన ద్విచక్ర వాహదారుడు అశోక్ మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలైయ్యాయి.
- గత జూలై 29 బుళ్లసముద్రం వద్ద వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఈచర్ వాహనం ఢీ కొట్టింది. దీంతో అదే గ్రామానికి చెందిన ప్రసాద్ అక్కడికక్కడే చనిపోయాడు.
- అక్టోబర్ 17న వెటర్నరీ కళాశాల సమీపంలో బొలెరో వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.
- నవంబర్ 23న తడకలపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనడంతో కర్ణాటకకు చెందిన ద్విచక్ర వాహనదారుడు అక్కడిక్కడే మృతి చెందాడు.
- నవంబర్ 30న యూ రంగాపురం నుంచి నడిచి వస్తున్న వ్యక్తి లక్ష్మీనరసప్పను లారీ ఢీ కొంది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు.
- నవంబర్ 30 హరేసముద్రం క్రాస్‌లో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో హరేసముద్రానికి చెందిన సిద్ధేశ్వరప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అయితే బెంగళూరులో చికిత్స పొందుతూ చనిపోయాడు.
- డిసెంబర్ 21 బుళ్లసముద్రం వద్ద ఆగివున్న లారీని వెనుక నుంచి టెంపో ట్రావెలర్ వాహనం ఢీ కొన్నడంతో అందులో ఉన్న ఐదుగురు మృతి చెందగా 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి.
- ఇలా మడకశిర – అగళి జాతీయ రహదారిపై 6 నెలల్లోనే 12 మందికిపైగా మృతి చెందారు. 25 మందికిపైగా గాయపడ్డారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



మడకశిర ,రొళ్ల, అగళి మండలాల్లోని జాతీయ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు ఆయా ప్రాంతాల్లోని వాహనదారులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. ముఖ్యంగా పెట్రోలింగ్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతంలో బ్లాక్ స్పాట్‌గా గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– ఎస్ఎస్ మూర్తి, హరేసముద్రం, మడకశిర మండలం

అన్ని చర్యలూ తీసుకుంటున్నాం



జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఆరుగురు పోలీస్ సిబ్బందితో రాత్రి, పగలు పెట్రోలింగ్ చేయిస్తున్నాం. వాహనదారులకు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అవగాహన కల్పిస్తున్నాము. గత 15 రోజుల నుంచి జాతీయ రహదారిపై ఏ చిన్న ప్రమాదం జరుగలేదు. రహదారి మధ్యలో గ్రామాలు ఉన్న చోట వాహనదారులు వేగం తగ్గించి రావాలని డ్రైవర్లుకు సూచిస్తున్నాం.

– రాగిరి రామయ్య, సీఐ, మడకశిర

డివైడర్‌ను ఢీకొన్న లారీ



మడకశిర: పట్టణ సమీపంలోని చౌటిపల్లి వద్ద సోమవారం ఉదయం ఓ సిమెంట్ లారీ డివైడర్‌ను ఢీకొంది. అనంతపురం నుంచి తుమకూరుకు సిమెంట్ తీసుకెళుతున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పొగమంచు కారణంగా ఈప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఉదయాన్నే పట్టణంలో పొగమంచు పెద్ద ఎత్తున కమ్మేసింది. ఈ సమయంలో లారీడ్రైవర్‌కు రోడ్డు కనబడకపోవడంతో ఈప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. లారీ ముందు భాగం కొంత మేరకు దెబ్బతింది. ఈ ప్రమాదం నుండి డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డుపై పడి ఉన్న వృద్ధురాలు ముద్దమ్మ

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట కాలనీ సమీపంలోని 544ఈ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముద్దమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివరాల మేరకు.. ముద్దమ్మ 544ఈ జాతీయ రహదారిని దాటుతుండగా మడకశిర వైపు నుంచి అతివేగంగా ద్విచక్ర వాహనంలో జీవన్ అనే వ్యక్తి వచ్చి ఢీకొన్నాడు. ముద్దమ్మకు బలమైన గాయాలు కాగా జీవన్ కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

స్కేటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 'పురం' విద్యార్థులు

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఆదివారం స్పోర్ట్స్ అసోసియేషన్ స్కేటింగ్ యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కేటింగ్ ఐకాన్ పోటీలు హైదరాబాద్ బాలయోగి గచ్చిబౌలి స్టేడియంలోని స్కేటింగ్ రింగ్‌లో నిర్వహించారు. అండర్–4లో ఎం.జి.దక్షేష్, అండర్–6లో పీఎం జస్విక్ సౌర్య, అండర్–8లో పీఎం వర్షిక మొదటి స్థానంలో నిలిచారు. అండర్–10 బాలికల విభాగంలో వర్షిక రెండో స్థానంలో నిలవగా, అండర్–8లో ఎస్.తర్వేజ్ రెండో స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, కోచ్ హేమంత్‌కుమార్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

అమరాపురం: మండలంలోని చిట్నడుకు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. దీంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు.. గుడిబండ మండలం దాసరిపల్లికి చెందిన నాగరాజు కుటుంబ సభ్యులు అమరాపురంకు వస్తున్నారు. నాగరాజు కుమార్తెను కేజీబీవీ పాఠశాలలో వదలడానికి వారు బయలు దేరారు. అలాగే పెద్దపల్లికి చెందిన చెన్నకేశవ.. హేమవతిలో సిద్దేశ్వరస్వామిని దర్శించుకుని తిరిగి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో చిట్నడుకు వద్ద రెండు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో నాగరాజు, పూర్ణిమ, రత్నమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని మడకశిర ఆస్పత్రికి తరలించారు. చెన్నకేశవ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు తరలించారు.

అలరించిన సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

పావగడ: నాగలమడక అంత్య సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాసవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ద్వారకామయి, వాసవి వనితా మండలి, తాళ్లపాక అన్నమయ్య, శ్రీవారి భజన బృందాలు ఆలపించిన సంకీర్తనలు భక్తులను అలరించాయి. సాయంత్రం సామూహిక సత్యనారాయణ వ్రతం, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యుడికి ఉయ్యాలోత్సవం నిర్వహించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

సోమందేపల్లి: ఏపీ ఎస్టీఏ నూతన సంవత్సర క్యాలెండర్లను ఎంఈఓ ఆంజనేయులునాయక్ స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రొళ్ల: ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ ఆ కాలనీకి చెందిన మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. రత్నగిరి గ్రామంలో ప్రధాన రోడ్డుపై మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. వారం రోజులుగా తీవ్రమైన తాగునీటి సమస్య ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కరించకపోతే మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

దళారులను నమ్మొద్దు

పెనుకొండ రూరల్: ఇంటి పట్టాల మంజూరు కోసం దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ శ్రీధర్ ప్రజలకు సూచించారు. ఎన్టీఆర్ కాలనీలోని సర్వే నంబర్ 264, జగనన్న కాలనీ సర్వే నంబర్లు 263, 262, 228, మడకశిర రోడ్డులోని సర్వే నంబర్ 668లో ఇంటి పట్టాల ఇప్పిస్తామని దళారులు ప్రజలను మభ్యపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు, దళారులపై ఫిర్యాదు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేయడం హేయం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



హిందూపురం: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరమైంది. వైద్య సేవలను కూడా ప్రజలకు దూరం చేస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక విమర్శించారు. సోమవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. వైద్యం కోసం పేదలు అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతోనే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారన్నారు. నిరుపేదలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించడంతో పాటు కొలుకునే వరకూ ఆర్థికసాయం అందించారని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు కూటమి పాలనలో అప్పటి ప్రభుత్వాలకు భిన్నంగా పేదవాడికి వైద్యాన్ని భారం చేశారన్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ కింద రూ.3 వేల కోట్లు బకాయిలు చెల్లించలేదన్నారు. జనవరి 26వ తేదీ లోపు కనీసం రూ.2 కోట్లు చెల్లించి దఫాల వారీగా మిగిలిన మొత్తాలు ఇవ్వండని డాక్టర్ల అసోసియేషన్ కోరుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న విధానం కాకుండా ఇన్సూరెన్స్ పద్ధతిని ప్రవేశపెట్టాలని చూస్తుండటంతో పేదవారి ఆరోగ్య భద్రతకు ముప్పు వాటిల్లినట్లేనన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్వహిస్తున్న బసవతారకం ఆస్పత్రికి బిల్లులన్నీ చెల్లించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీని పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిలమత్తూరు: పంచాయతీ నిధులు దుర్వినియోగమైన నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల్లోనే సుమారు రూ. 60 లక్షల మేర పంచాయతీ నిధులు డ్రా చేశారని, కానీ ఏఏ పనులు చేపట్టారో మాత్రం చెప్పడం లేదన్నారు. ఖర్చుకు మించి బిల్లులు ఎలా మంజూరు చేయించుకున్నారో టీడీపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. అవినీతి విషయాన్ని పార్టీ సమన్వయకర్త దీపిక దృష్టికి తీసుకువెళ్లామని తహసీల్దార్‌కు వివరించారు. పత్రికల్లో వచ్చిన కథనాలపై అధికారులు తూతూ మంత్రంగా విచారణ చేసి ముగించాలని చూస్తున్నారని, కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి స్వాహా డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ యూనిస్‌బాబు మాట్లాడుతూ నిధుల గోల్‌మాల్‌ను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పర అశ్వర్థప్ప, నాగభూషణరెడ్డి, శివారెడ్డి, భాస్కర్ రెడ్డి, సూర్యనారాయణ, తిప్పన్న,ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా విడుదల



హిందూపురంలో ఓటరు జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

హిందూపురం: నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటరు జాబితాను అధికారులు ప్రకటించారు. నియోజకవర్గంలో పురుషులు 1,25,161, మహిళలు 1,25,213, ట్రాన్స్‌జెండర్లు 19 మొత్తం 2,50,393 ఓటర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సవరించిన తుది ఓటరు జాబితాను స్థానిక ఎన్నికల అధికారులు సోమవారం ప్రకటించారు. మొత్తం 2,11,799 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 1,06,202, మహిళా ఓటర్లు 1,05501, ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఒకటి, సర్వీస్ ఓటర్లు 75 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మంచు దుప్పటి



రొద్దంలో కప్పేసిన మంచు

రొద్దం: రోజు రోజుకూ చలి వాతావరణం పెరుగుతోంది. ఉదయం 9 గంటలు దాటుతున్నా రోడ్లపై దట్టమైన మంచు ఉండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు చలి మంటలు కాపుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అబాకస్, వేదిక్ మాథ్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: విశ్వం ఎడిటెక్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలోని స్థానిక ఆదిత్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయిలో పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండలంలోని పెద్దగుడ్డంపల్లి ఉషోదయ పాఠశాల, పట్టణంలోని బాలాజీ ఉషోదయ పాఠశాల విద్యార్థులు చరణ్, మైత్రి అత్యంత ప్రతిభ కనబరిచారు. వేదిక్ మాథ్స్, వాల్యూం వన్, అబాకస్ జూనియర్ లెవెల్ వన్‌లో, జోనల్ స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేయగా ఎంఈఓ గంగప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అబాకస్, వేదిక్ గణితం విద్యార్థులకు బోధించడం వల్ల గణితం కష్టమనే భావన ఉండదని, సులభంగా విద్యార్థులు నేర్చుకుంటారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్మయి రెడ్డి, ఏజీఎం రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ శివరాం, పరిపాలన అధికారులు లక్ష్మీ, అరుణకుమారి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఎంపీడీఓగా నాగేంద్ర బాధ్యతలు

సోమందేపల్లి: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నాగేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాగి సాగు విస్తీర్ణాన్ని పెంచండి

అగళి: మండల పరిధిలోని రావుడి పంచాయతీ కేంద్రంలో రాగి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వమే క్వింటాలుకు రూ.4,239 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు.

వ్యక్తి అదృశ్యం



నారాయణరెడ్డి (ఫైల్)

పరిగి: మండలంలోని సేవామందిరం అగ్రిగోల్డ్ లేఅవుట్లో నివాసముంటున్న నారాయణరెడ్డి (78) అదృశ్యమైనట్లు కుమారుడు మారుతీ ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 2న ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగిరాలేదన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రంగడుయాదవ్ తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చిలమత్తూరు/హిందూపురం టౌన్/లేపాక్షి: చిలమత్తూరు, లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు హిందూపురంలోని బాలికల జూనియర్ కాలేజీలను సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని వారు పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నేత బాబావలి, సాయిరాం, నాయకులు విజయ్, చరణ్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని వినతి



వినతిపత్రాన్ని చూపుతున్న జబీవుల్లా

పెనుకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భోజన వసతులు కోసం ఖర్చు చేసిన బిల్లులను చెల్లించాలని కాంట్రాక్టర్ జబీవుల్లా షాపు యజమానులతో కలిసి సోమవారం ప్రజా సమస్యల వేదికలో ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు అర్జీ ఇచ్చారు. భోజన వసతి , బారికేడ్లు, ట్రాన్స్‌పోర్టు, షామియానా, ఇతర సదుపాయాల కోసం దాదాపుగా రూ. 53 లక్షల వరకూ ఖర్చు చేశామన్నారు. ఇంకా రూ.10.75 లక్షల బిల్లు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని కోరారు. హైదర్, జయంత్, దాదు, టిప్పు, సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించండి

పావగడ: పట్టణంలో తాలూకా ప్రభుత్వాస్పత్రులకు రోజూ వందల సంఖ్యలో గ్రామీణ ప్రాంత పేద రోగులు చికిత్స కోసం వస్తుంటారని, అయితే 14 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే వైద్యులు ఉండటం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తెలిపారు. దీంతో రోగులు ప్రైవేటు డాక్టర్లను ఆశ్రయిస్తున్నారన్నారు. జేడీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసినా పట్టించుకోలేదని, ఇప్పటికై నా ఖాళీగా ఉన్న వైద్యుల స్థానాలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తాలూకా వైద్యాధికారికి వినతిపత్రం అందించారు.

సంక్షిప్త సమాచారం

8 అర్జీలు

పెనుకొండ రూరల్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

రోడ్లపైకి పశువులు రాకుండా చర్యలు చేపట్టండి

పెనుకొండ: పశువులు రోడ్లపైకి రాకుండా తగిన చర్యలు చేపట్టాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు హరి, బాబావలి తదితరులు నగర పంచాయతీ కార్యాలయంలో మేనేజర్ నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందించారు.

సమస్యలు పరిష్కరించండి

లేపాక్షి: రాష్ట్రంలోని బుడగ, బేడ జంగం కులస్తుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ సౌజన్య లక్ష్మికి సోమవారం మండలంలోని ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. బుడగ, బేడ జంగం కులం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఈశ్వరప్ప, గంగాధర్, ఆంజనేయులు, రంగనాథ్, బాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి గాయాలు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న లోకేష్ (14)ను ద్విచక్ర వాహనం ఢీకొంది. సోమవారం సాయంత్రం పాఠశాలను ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జాతీయ రహదారిలోకి రాగానే ద్విచక్ర వాహనంలో వస్తున్న వ్యక్తి లోకేష్‌ను ఢీ కొట్టాడు. లోకేష్ గాయపడటంతో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

అమరాపురం: ప్రతి బాలికా బాల్య వివాహాలపై అవగాహన పెంచుకొని క్రమశిక్షణతో విద్యను అభ్యసించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సీడీపీఓ శాంతలక్ష్మి సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర్ వికాసం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ అన్ని శాఖ అధికారులు సమష్టి కృషితో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు.

లైన్‌మెన్‌పై దాడికి యత్నం

గోరంట్ల: మండల పరిధిలోని కాగానిపల్లికి చెందిన మహబూబ్‌బాషా ట్రాన్స్‌కో లైన్‌మెన్ వెంకటేష్‌పై దాడికి యత్నించారు. విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో సర్వీసు తొలగించడానికి వెళ్లిన తనపై మహబూబ్‌బాషా దాడికి యత్నించారని వెంకటేష్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. విధులకు ఆటంకం కలిగించిన మహబూబ్‌బాషా చర్యలు చేపట్టాలని విన్నించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



విజయకుమార్



హెచ్.బాబు

పెనుకొండ: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పెనుకొండ మండల ఎస్టీఏ కమిటీ ఎన్నిక నిమిత్తం జిల్లా ఉపాధ్యక్షులు విజయకుమార్ నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని, భవిష్యనిధి, ఏపీజీఎల్ఐ లోన్లు, సరండర్ లీవ్‌ల మొత్తాలను వెంటనే విడుదల చేయాలన్నారు. 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని ప్రభుత్వానికి విన్నవించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్షుడిగా విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా హెచ్.బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్‌నాయక్, జాయింట్ సెక్రటరీగా వలీవుల్లా, కోశాధికారిగా షహనాజ్‌భాను తదితరులు ఎంపిక చేశారు.

విద్యార్థులు క్రీడలోన్లూ రాణించాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి రఘువీరా

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకుని రాణించాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి కోరారు. సోమవారం ఆయన పాఠశాలను సందర్శించారు. రూ.లక్ష విలువ చేసే క్రీడా సామగ్రిని పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగస్వామి, పీఈటీ రాజేష్ పాల్గొన్నారు.